ఖరీఫ్ కష్టమేనా..?

- ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలు
- గతేడాది తీవ్ర నష్టాలతో సతమతం
- రైతన్నను ఆదుకోని కూటమి ప్రభుత్వం
- ఖరీఫ్ ప్రారంభమైనా రైతు భరోసా ఊసే ఎత్తని సర్కార్

కోడుమూరు రూరల్: తొలకరి వర్షాలతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈ సారైనా ఎంతో కొంత లాభం రాకపోతుందా అనే ఆశతో ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్నారు. గతేడాది అతి వృష్టి అనావృష్టి కారణంగా ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన పంటలన్ని దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయి ఆర్థికంగా చితికిపోయారు. రైతులను ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోంది. దీంతో రైతులు మరోసారి వ్యవసాయమనే ఆశల జూదానికి సిద్ధమయ్యారు.

ఆశలన్నీ ఖరీఫ్‌పైనే

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికే ముందే భారీ వర్షాలు కురుస్తుండడంతో రైతులంతా ఖరీఫ్‌పైనే ఆశలు పెట్టుకుని భారీగా పత్తి, వేరుశనగ, కొర్ర, కంది, ఆముదం, మొక్కజొన్న, సజ్జ వంటి పంటల సాగుకు సమాయత్తమయ్యారు. దీంతో ఈ ఏడాది నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు రూరల్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 32 వేలకు పైగా హెక్టార్లలో పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కొన్ని గ్రామాల్లో ముందుగా కురిసిన వర్షాలకు ఇప్పటికే కంది, పత్తి వంటి పంటలను వేశారు.

జమకాని పంట నష్టపరిహారం

గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో అతివృష్టి అనావృష్టితో సాగు చేసిన పంటలు దెబ్బతినడంతో రైతులు నష్టపోయారు. ముఖ్యంగా రబీ సీజన్‌లో శనగ, జొన్న వంటి పంటలు సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా దక్కలేదు. దీంతో కూటమి ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి చేతులు దులుపుకుందే తప్ప ఇంత వరకు పైసా పరిహారాన్ని కూడా జమచేయ లేదు. జగనన్న పాలనలో ఏ సీజన్‌లో పంటలు నష్టపోతే ఆ సీజన్ ముగిసే నాటికే పంట నష్టపరిహారం డబ్బులను రైతన్నల ఖాతాలో జమచేసేవారు. కూటమి ప్రభుత్వం మాత్రం పరిహారం డబ్బులను చెల్లించకుండా రైతులను మానసికంగా వేధిస్తోంది.

రైతు భరోసా ఊసే ఎత్తని ప్రభుత్వం

ఎన్నికల ముందు సూపర్‌సిక్స్‌లో భాగంగా రైతన్నకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాదవుతున్నా రైతు భరోసా ఊసే ఎత్తడం లేదు. ఇప్పటికే ఏడాదికి సంబంధించిన రైతు భరోసాను రైతులు కోల్పోయారు. ఖరీఫ్ ప్రారంభమవుతున్నా రైతు భరోసా పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో కూడా కూటమి ప్రభుత్వం ప్రకటించకపోవడంతో ఆశనిరాశల మధ్యే రైతులు వ్యవసాయ పనులను కొనసాగిస్తున్నారు. చేతిలో పెట్టుబడికి డబ్బులు లేక స్థానికంగా ఉన్న వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమకు రైతు భరోసాతో పాటు, పంట నష్టపరిహారం డబ్బులను చెల్లించాలంటూ రైతులు కోరుతున్నారు.


ఎర్రదొడ్డిలో కంది విత్తనం వేస్తున్న రైతన్న

పెట్టుబడులకు డబ్బుల్లేవ్



ముందస్తు వానలు కురుస్తుండడంతో 5 ఎకరాల్లో ఇప్పటికే పత్తి పంట సాగు చేశా. మున్ముందు మరిన్ని వానలు పడితే పదెకరాల్లో వర్షాధారంగా ఉల్లి పంట సాగు చేసేందుకు సిద్ధమవుతున్నా. గత రబీ సీజన్‌లో సరైన సమయానికి వానలు కురవక పదెకరాల్లో సాగు చేసిన శనగ పంట నష్టపోయా. ఇప్పటి వరకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని కూడా మంజూరు చేయలేదు. జగనన్న ఏటా ఇచ్చే రైతు భరోసా డబ్బులను కూడా ఏడాదిగా కూటమి ప్రభుత్వం ఇవ్వకపోవడంతో పెట్టుబడులకు డబ్బుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.

–శివ, రైతు వెంకటగిరి గ్రామం, కోడుమూరు

రైతులను ఆదుకోవాలి



ముందస్తుగా కురుస్తున్న వానలకు నాలుగెకరాల్లో పత్తి విత్తనాలు నాటా. మునుముందు మరిన్ని వానలు పడితే ఐదున్నర ఎకరాల్లో కంది, పొగాకు వంటి పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నా. గతంలో జగనన్న పాలనలో పెట్టుబడి సాయంగా ఖరీఫ్‌కు ముందు డబ్బులను రైతుల ఖాతాల్లో జమచేసేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదు. ఏడాదిగా రైతు భరోసా డబ్బులను కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. గత రబీసీజన్‌లో నాలుగెకరాల్లో శనగ పంట వేస్తే పెట్టుబడి కూడా దక్కలేదు.

–పాలదస్తగిరి, రైతు చనుగొండ్ల, గూడూరు

క్లుప్తంగా

భూ సమస్యలపై వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కర్నూలు(రూరల్): భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రూరల్ తహసీల్దార్ టీవీ రమేష్ బాబుకు వినతిపత్రాలు అందజేశారు. దిన్నెదేవరపాడు, నందనపల్లె, గార్గేయపురం, పడిదెంపాడు, ఆర్.కొంతలపాడు, నూతనపల్లె తదితర గ్రామాలకు చెందిన రైతులు సమస్యలపై అర్జీలు అందజేశారు. ఆయా సమస్యలను విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ వీఆర్వోలను ఆదేశించారు.

యోగాంధ్రను జయప్రదం చేయండి

ఓర్వకల్లు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 3 వ తేదీన స్థానిక రాక్‌గార్డెన్‌లో నిర్వహించే యోగాంధ్రను జయప్రదం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు..రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాక్‌గార్డెన్‌లో ఉదయం 7 గంటలకు యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, స్థానిక ఎమ్మెల్యే గౌరు చరిత ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

మతసామరస్యం పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగార్జున రెడ్డి


గడివేముల: బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ నాగార్జున రెడ్డి కోరారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దలు, శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు బక్రీద్ పండుగ మత సామరస్య భావనతో జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈద్గాల వద్ద పోలీసులను ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌చార్జ్ తహసీల్దార్

సి.బెళగల్: ప్రజల నుంచి వచ్చే వినతులను ఆయా శాఖల అధికారులు విచారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. బ్రాహ్మణదొడ్డి, పోలకల్, సి.బెళగల్ తదితర గ్రామాల నుంచి రైతులు భూ సమస్యలు, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు అర్జీలను అందజేశారు. అర్జీల సమస్యలపై వీఆర్వోలతో చర్చించి, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.

కోలుకోలేక విద్యార్థి మృతి


మృతి చెందిన విద్యార్థి రామకృష్ణ

ఓర్వకల్లు: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న మండలంలోని లొద్దిపల్లె గ్రామం విద్యార్థి కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కురువ వెంకటరమణ కొడుకు రామకృష్ణ(14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు రావడంతో సరదాగా తోటి విద్యార్థులతో కలిసి క్రీడా పోటీలు ఆడేవాడు. ఈ క్రమంలో ఫుట్‌బాల్ పోటీలో ఓడిపోవడంతో దిగాలు చెందుతూ సెల్ ఫోన్ చూస్తుండగా తల్లిదండ్రులు మందలించారు. తీవ్ర మనస్థాపానికి గురైన ఆ విద్యార్థి ఈనెల1న ఇంట్లోని గడ్డి మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అయితే, కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి


తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. పేదలందరికీ ఇంటి స్థలాలు, ఇండ్లు మంజూరు చేయడంతో పాటు, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. పాలన చేపట్టి ఏడాదవుతున్నా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతు భరోసా, తల్లికి వందనం, ఉచిత బస్సు, 18సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 వంటి పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యురాలు సులోచనమ్మ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్న రాముడు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీటెక్ విద్యార్థి రుష్వి, హెడ్ కానిస్టేబుల్ రామచంద్రగౌడు

ఓర్వకల్లు: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కాల్వబుగ్గ సమీపంలో సోమవారం ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామానికి చెందిన కె.రుష్వి పాణ్యం దగ్గర గల ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ప్రతి రోజు బైక్‌పై కాలేజీకి వెళ్లేవాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం కాలేజీకి వెళ్లి వస్తుండగా కాల్వబుగ్గ సమీపంలోని యుటర్న్ వద్ద డీఆర్‌డీఓలో విధులు నిర్వర్తిస్తున్న ఓ వ్యక్తి వేగంగా బైక్‌పై వస్తూ ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇంజినీరింగ్ విద్యార్థి తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. అదేవిధంగా కర్నూలు నుంచి నంద్యాల వైపు కారులో వెళ్లుతున్న కొందరు వ్యక్తులు కాల్వబుగ్గ వద్ద కొబ్బరిబొండాలు తాగేందుకు రోడ్డు పక్కన కారును ఆపుకున్నారు. అదే సమయంలో కర్నూలు వైపు నుంచి విధుల నిమిత్తం రామచంద్రగౌడు అనే పోలీసు హెడ్ కానిస్టేబుల్ తన రాయల్ ఎన్‌ఫీల్డు (బుల్లెట్) వాహనంపై బేతంచెర్లకు వెళ్తున్నాడు. ఆదమరిచి ఆగిఉన్న కారును ఢీ కొనగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. క్షతగాత్రులను అంబులెన్స్ వాహనాల్లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో విద్యార్థి రుష్వి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన


క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

సి.బెళగల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న క్షయ వ్యాధి (టీబీ) పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ, కుష్ఠు, ఎయిడ్స్ వ్యాధి నివారణ అధికారి భాస్కర్ అన్నారు. సోమవారం టీబీ నివారణ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి, డివిజన్ టీబీ సూపర్‌వైజర్ నాగమహేంద్ర ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ, టీబీ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా టీబీ పరీక్షలను నిర్వహించడంతో పాటు వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్యం, ఆర్థిక సహాయాలను అందిస్తుందని తెలిపారు. డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని.. 60 ఏళ్లపైబడిన వారు, బీపీ, షుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్నవారికి గళ్ల పరీక్షలు చేస్తున్నామని వివరించారు. నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలపాటు ఉచితంగా మందులు, పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.1000 చొప్పున చెల్లిస్తామన్నారు.

జాతీయ క్షయ నిర్మూలనపై అవగాహన

కల్లూరు: టీబీ, ముక్త్ భారత్ అభియాన్ ఇన్‌టెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్‌లో భాగంగా ఏ.గోకులపాడులో నిక్షై శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు టీబీ ముక్త్ భారత్ అభియాన్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్లు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీల గడువు పొడిగింపుతో పైరవీలకు అవకాశం

- ప్రక్రియ కొలిక్కి వచ్చిన తరుణంలో పొడిగింపుపై సర్వత్రా ఆందోళన
- కూటమి నేతలకు లబ్ధి చేకూర్చేందుకే అంటూ విమర్శలు
- తమవి అనుకున్న స్థానాలు తారుమారు అయ్యే ప్రమాదం

కర్నూలు(అగ్రికల్చర్): బదిలీల ప్రక్రియను కూటమి ప్రభుత్వం ఈ నెల 9వ తేదీ వరకు పొడిగించడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. పైరవీలు, రాజకీయ సిఫారసులను మరింత పెంచడం కోసమే గడువును పొడిగించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు అన్ని శాఖల్లో బదిలీలు ఒక కొలిక్కి వచ్చాయి. 2వ తేదీ అర్ధరాత్రి తర్వాత బదిలీ ఉత్తర్వులు జారీ చేయడానికి అన్ని శాఖలు సిద్ధమయ్యాయి. బదిలీల గడువు పొడిగించాలని ఏ ఉద్యోగ సంఘం కూడా ప్రభుత్వాన్ని కోరిన దాఖలాలు లేవు. ఈ స్థితిలో వారం రోజుల పాటు గడువును పొడిగించారంటే పైరవీలను ప్రోత్సహించడమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో ఎప్పుడూ లేని విధంగా వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, సేట్ ఆడిట్, మార్కెటింగ్ శాఖ, డీఆర్‌డీఏ తదితర శాఖల్లో రాజకీయ ప్రమేయం పెరిగింది. రాజకీయ సిఫారసు లేకుండా బదిలీలు జరుగుతున్న దాఖలాలు లేవు. కూటమి పార్టీల నేతలకు బదిలీలు ఆదాయ వనరుగా మారాయి. మేము చెప్పినపనులు యథాతథంగా చేయాలి. వైఎస్సార్‌సీపీ వారికి ఎలాంటి పనులు చేయరాదనే షరతులతో సిఫారసు లెటర్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. కల్లూరు, ఎమ్మిగనూరు, ఆదోని మండల వ్యవసాయ అధికారి పోస్టులకు కూటమి పార్టీల నేతలకు రూ.లక్షలు ఇచ్చుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏదో విధంగా పోస్టు దక్కించుకున్నాం. ఆర్డర్ రావడమే తరువాయి అనుకునే సమయంలో గడువును వారం రోజుల పాటు పొడిగించడం వల్ల పైరవీలు పెరిగి మార్పులు, చేర్పులు జరిగే ప్రమాదం ఏర్పడింది. రాజకీయ సిఫార్సు లేకుండా ఒక్కటంటే ఒక్క బదిలీ కూడా జరిగే పరిస్థితి లేదు. బలం ఉన్నోడిదే రాజ్యం అన్నట్లుగా.. రాజకీయ పరపతి, డబ్బు బలం ఉన్నవారికి కీలక పోస్టులు దక్కే పరిస్థితి ఏర్పడింది. బదిలీలకు ఈ నెల 9వ తేదీ వరకు అవకాశం కల్పించడంతో పైరవీలు పెరుగుతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఉద్యోగ సంఘాలు మరింత చెలరేగే పరిస్థితి ఏర్పడింది. బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలనుకుంటే గడువు పొడిగించే అవకాశం ఉండదు. గడువు పొడిగించడం అంటే అవినీతి, అక్రమాలను ప్రోత్సహించడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మోసం చేయడం బాబుకు అలవాటే

- మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు
- రేపు వెన్నుపోటు దినం


పోస్టర్ విడుదల చేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి


వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు

కోడుమూరు రూరల్: సూపర్ సిక్స్ హామీలతో సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలను దారుణంగా మోసం చేశారని గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, లక్ష్మన్న విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న నిర్వహిస్తున్న 'వెన్నుపోటు దినం' పోరాట కార్యక్రమ వాల్‌పోస్టర్లను సోమవారం గూడూరులో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయకుండా దగా చేస్తోందన్నారు. అమలు చేయాలని ప్రశ్నిస్తే వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని ఆరోపించారు. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను రద్దు చేసి ప్రజలకు ఎలాంటి పథకాలు ఇవ్వకుండా దారుణంగా మోసం చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వైనాన్ని ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం గూడూరులో నిర్వహిస్తున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామాంజినేయులు, సర్పంచ్‌లు గోపాల్, మాధవస్వామి, ఎంపీటీసీ యేసేపు, నాయకులు నరసింహారెడ్డి, పత్తి రంగడు, సత్యాలు, మూలగేరి రంగడు, ప్రభాకర్, శివ, గిడ్డయ్య, గంగాధర్, శీలన్న, వీరేష్, సుధాకర్, రామాంజినేయులు, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

పాణ్యం: ఏడాది పాలనలో చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడదామని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నేత సద్దల సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇందులో భాగంగా ఈనెల 4వ తేదీన చేపట్టే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం పాణ్యంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. వెన్నుపోటు దినంలో భాగంగా చేపట్టే నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలన్నారు. గత ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు అధికారం కోసం అనేక హామీలు ఇచ్చారన్నారు. అందులో సూపర్ సిక్స్ ప్రధానమైనవని చెప్పారు. అయితే, ఈ హామీల్లో ఇప్పటి వరకు ఏ ఒక్కటి కూడా సరిగ్గా అమలు చేయలేదన్నారు. ఏడాది పాలనలో పెరిగిన ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదని అరాచక పాలన సాగుతుందని విమర్శించారు. అన్ని రంగాల కార్మికులకు జీవనోపాధి కరువైందన్నారు. ఈనెల 4వ తేదీన మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కల్లూరు లోని కాటసాని రాంభూపాల్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి కల్లూరు తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతి పత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, సుమంత్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, చందమామ బాబు, పెద్ద ఎల్లసుబ్బయ్య, మహేష్, సురేంద్ర, కె. మహేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం


వెన్నుపోటు దినం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు(రూరల్) : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మోహన్‌బాబు అన్నారు. కర్నూలు నగరంలోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏడాదైనా హామలు నేరవేర్చకుండా చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. కర్నూలు మండల వైస్ ఎంపీపీ మాట్లాడుతూ.. ఈ ఏడాది చూస్తుంటే 2014 చంద్రబాబు పాలన గుర్తుకొస్తోందన్నారు. మళ్లీ అదే పునరావృతం అవుతోందని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు ఎందుకు ఓటేశామని ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. పార్టీ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు వినయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కోసం ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా రాజధాని పేరుతో వేలాది కోట్లు అప్పు చేస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తోందని విమర్శించారు. వలంటరీ వ్యవస్థ, ఇంటింటికి బియ్యం పంపిణీ వాహనాలను రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం ఈ నెల 4వ తేదీ తలపెట్టిన వెన్నుపోటు దినం పోస్టర్లను విడుదల చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. నాయకులు సంపత్ కుమర్, వెంకటేశ్వర రెడ్డి, రామకృష్ణ యాదవ్, బొజ్జన్న, గిరిప్రసాద్, వెంకటేష్,మల్లిఖర్జున, ఆదాం, రామరాజు, సులేమాన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ సర్కిల్ ఏర్పాటుపై హర్షం

కల్లూరు : నగరంలోని ఉల్చాల రోడ్డులోని వై.జంక్షన్‌ను ఛత్రపతి శివాజీ మహారాజ్ సర్కిల్‌గా మున్సిపల్ కౌన్సిల్‌లో నామకరణం చేయడంపై మరాఠ సేవా సమితి, హిందూ ధర్మరక్షకులు, ధార్మిక సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. సోమవారం విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు ప్రతాపరెడ్డి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డిని కలిసి శివాజీ మహారాజ్ జయంతి నాటికి ఆ సర్కిల్‌లో శాశ్వత విగ్రహాన్ని ప్రతిష్టించాలని కోరారు. కార్యక్రమంలో మరాఠ సేవా సమితి నాయకులు బాలాజీరావు, గంగారాం, హిందూ ధర్మరక్షకులు శివప్రసాద్, మధు, వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

అరుదైన గుండె ఆపరేషన్

కర్నూలు(హాస్పిటల్): గుండెలో మూడు రక్తనాళాలు మూసుకుపోయిన వ్యక్తికి కర్నూలు అమీలియో హాస్పిటల్ వైద్యులు ఆపరేషన్ చేసి ప్రాణం పోశారు. వివరాలను హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ అధినేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ చాపే, కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ బావాజీ కొండూరి వివరించారు. దేవనకొండ మండలానికి చెందిన పి.కొలుట్లమ్మ (45) అనే మహిళ పదేళ్లుగా గుండె సమస్యతో బాధపడుతోందన్నారు. క్రానిక్ రుమాటిక్ హార్ట్ వ్యాధి ఉన్నట్లు వైద్యపరీక్షల్లో నిర్ధారించామన్నారు. ఆమె గుండెలో మూడు వాల్వ్‌లు మూసుకుపోయినట్లు తెలుసుకున్నట్లు వివరించారు. గత నెల 25న ఆమెకు 8 గంటల పాటు శ్రమించి ఆరోగ్యశ్రీ కింద గుండె ఆపరేషన్ చేశామన్నారు. కార్డియో పల్మనరీ బైపాస్ చేసిన తర్వాత గుండెకు మూడు వాల్వ్‌లు కృత్రిమంగా అమర్చినట్లు చెప్పారు. ఇందుకు అనస్తీషియా వైద్యులు అనిల్‌కుమార్, సిబ్బంది సహకరించారన్నారు.

రసాయన ఎరువులు వాడొద్దు


దుర్వేశి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ సూగన్న

గడివేముల: పంటలకు అధికంగా రసాయన ఎరువులు వాడరాదని ఐసీఏఆర్ శాస్త్రవేత్త డా.సూగన్న రైతులకు సూచించారు. వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తూ మంచి దిగుబడి ఫలాలు సాధించాలని సూచించారు. సోమవారం మండల పరిధిలోని గడిగరేవుల, దుర్వేశి,కొరటమద్ది గ్రామాల్లో 'వికసిత కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తూ సకాలంలో పంటకు అవసరమైన ఎరువులు అందజేయడానికి డ్రోన్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. పంటలకు మోతాదుకు మించి రసాయనాలు, అధిక శాతం నీరు పంటలకు ఇవ్వడం ద్వారా భూసాంద్రత, కార్బన్ కంటెంట్, సూక్ష్మ పోషకాలు తగ్గే అవకాశం ఉందన్నారు. పొలాల్లో ప్రకృతి సేంద్రీయ ఎరువుల వాడకం పెంచాలని చెప్పారు. కంది, వరి, సోయాబీన్, జొన్న పంటల్లో సస్యరక్షణ చర్యలైన విత్తన శుద్ధి, తెగుళ్లు, పురుగు మందుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ హేమసుందర్‌రెడ్డి, గడిగరేవుల సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల సాధనపై చిత్తశుద్ధి లేని ప్రజాప్రతినిధులు


సమావేశంలో పాల్గొన్న వాల్మీకి నేతలు

కర్నూలు(అర్బన్): వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ సాధనపై ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని వాల్మీకి నేతలు తీవ్రంగా విమర్శించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో హైకోర్టు న్యాయవాది సూర్యనారాయణ, నాయకులు కుబేరస్వామి, తలారి క్రిష్ణుడు, కొల్లాయి పెద్దయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కేవలం ప్రకటనలు ఇవ్వడం మాని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలన్నారు. కేంద్ర ఎస్టీ కమిషన్ వద్ద ఉన్న ఫైల్‌ను కదిలించాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అమిత్‌షాతో మాట్లాడి ఎస్టీ రిజర్వేషన్ సాధనకు కృషి చేయాలన్నారు. వాల్మీకులను తప్పుదోవ పట్టించే విధంగా ఉద్యమాలు చేద్దాం రండి అని మోసపూరిత ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయం ఆదోని ఎమ్మెల్యేకు తెలియదా? అని ప్రశ్నించారు. వాల్మీకి సామాజికవర్గం బలంతో పదవులు పొందిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ ఎన్‌డీఏ కూటమిపై ఒత్తిడి పెంచడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీలు వాల్మీకి జాతి అసహనానికి గురికాకుండా తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు విష్ణు, హరిప్రసాద్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.